బయట నుండి వచ్చాయి. అవంతా తిరిగి వ్రాయడం కష్టం కదా. ఎలాగూ ఎగ్జామినర్ కూడా అదంతా చదవాలి. నీట్‌గా వుంటుంది చదవడానికి. అందుకని బయటనుండి వచ్చిన పేపర్ ఆన్సర్ పేపర్‌కి గుచ్చేశాడు. మిగతా కాగితాలన్నీ తెల్లకాగితాలే. ఇతను ఇంజనీరు కావచ్చు, డాక్టర్ కావచ్చు భవిష్యత్తులో.

ఈలోగా సూపర్‌వైజర్‌గారు ఒక చీటీ ఇచ్చి "ఈ కోడ్ నెంబర్ గల విద్యార్థిని పాస్ చెయ్యండి, అతను మనవాడే" అన్నాడు.

చూశాను.

ఆయన చెప్పిన విద్యార్థి 6వ ప్రశ్ననుండి 9వ ప్రశ్నవరకూ టైప్ చేసిన కాగితాలు గుచ్చిన ఘనుడు. అతను ఆన్సర్ పేపర్‌మీద తన రిజిష్టర్ నెంబర్ వెయ్యడానికి శ్రమించి వుండవచ్చును.

నేనేం చేయాలి?

....)o(....

# బ్రహ్మవాక్కు

"న్యాయా న్యాయాలు సక్రమంగా నిర్ణయింపబడుతున్నాయా లేదా" అనే ప్రశ్న అందరినీ వేధిస్తున్నా, కోర్టులూ, న్యాయవాదులూ, వాళ్ళ వృత్తులూ నిరాటంకంగా కొనసాగిపోతున్నాయి.

ఆరోజు కోర్టులో ఎన్నాళ్ళనుంచో కొనసాగుతున్న ఒక విడాకుల కేసులో సాక్ష్యాలు ముగిసిపోయేరోజు. ఆ తరువాత తీర్పు ఇస్తారు.

"ఈ కేసులో చివరి సాక్షి, విడాకులకు అర్థించిన దంపతుల ఏకైక కుమారుడు ఉదయ్ అన్నాడు జడ్జిగారు.

బోనులో ఎనిమిదేళ్ళ పిల్లాడిని తీసుకువచ్చి నిలబెట్టారు. అతని ప్రక్కనే అతని తండ్రి, పిల్లాడిని తీక్షణంగా చూస్తూ ఏదో సైగలు చేస్తున్నాడు. బోనుదగ్గర వున్న పోలీసులు అతన్ని దూరంగా పంపివేశారు.

భగవద్గీత మీద ప్రమాణంచేసి.... ఆ బాబు చేత ప్రమాణం చేయించారు. అతని దగ్గరకు లాయరుగారు వచ్చారు.

"బాబూ మీ అమ్మగారు, నాన్నగార్ని ప్రేమగా చూడకుండా, అందరి మగాళ్ళతో సరదాగా తిరిగేదా? మీ ఇంటికి మీ అమ్మగారి కోసం ఎంతమంది మగాళ్ళు వచ్చేవారు?

ఆ బాబు కళ్ళు ఎర్రగా వున్నాయి. పాలుకారే చిన్నారి బుగ్గలపై కన్నీటి చారలు చంద్రుడి మీద మచ్చలులావున్నాయి. అతని ముఖంలో దుఃఖం నిండివుంది.

"లాయర్‌గారూ, ఇంతవరకూ ఈ కోర్టులో మా అమ్మ గురించి సాక్ష్యం చెప్పిన వాళ్ళందరూ భగవద్గీతమీద ప్రమాణంచేసి అంతా నిజమే చెబుతానని, అందరూ అబద్దాలు చెప్పారు. నన్ను ఈ కోర్టులోవున్న వాళ్ళందరూ క్షమించాలి. అందుకే నేను మా అమ్మకోసం కోర్టుకు వస్తానని జడ్జిగారికి కబురు చేశాను.

నిట్టూరిస్తే వినిపించేంత నిశ్శబ్దంగావున్న ఆ కోర్టు హాలులో ఆ చిన్నారి మాటలు వింటున్న జనం, నాగుపాము కోర్టు హాలులో నడుస్తుంటే చూస్తున్నట్లుగా నిశ్శబ్దంగా, ఆశ్చర్యంతో చేష్టలుడిగి వుండి పోయాడు.

"మా అమ్మ దేవతండి. చాలా మంచిదండి మా అమ్మ" అమ్మను ఇంకా ఎలా పొగడాలో నాకు తెలియదు, కాని మానాన్న రాక్షసుడండి. మా అమ్మను వదిలేసి బోల్డు డబ్బుతో మరో కొత్త అమ్మను తీసుకువస్తాను. నువ్వు పాత అమ్మను గురించి చెడుగా చెప్పు బాబూ అన్నాడండి. నాకు ఎన్నో బొమ్మలు కొనిచ్చాడండి.

కాని—నేను అబద్దం చెప్పనండి, అబద్దం చెప్పేవాళ్ళను, నరకంలో నూనెమూకుట్లో అప్పచ్చులు వేయించినట్లు వేయిస్తారని అమ్మ చెప్పిందండి. అదిగో ఆ అమ్మే చెప్పిందండి. నేను అస్సలు అబద్దం చెప్పనండి. అది ఆ అమ్మే నా అమ్మ మా అమ్మతో మగాళ్ళు ఎవరూ మా ఇంటికి రాలేదండి. మా అమ్మకు నాన్న అంటే ఎంతో ప్రేమ, అది ఎలా చెప్పాలో నాకు తెలియదండి. జడ్జిగారూ నన్ను మా అమ్మ దగ్గరకు

అదిగో ఆ అమ్మ దగ్గరకు పంపించెయ్యండి. మా నాన్న కొత్త అమ్మతో సుఖంగా వుంటాడు. ఆ చిన్నారి బోనులో ఏడుస్తున్నాడు.

విజిటర్స్ లాంజ్‌లోంచి ఒక స్త్రీ పరుగు పరుగున వచ్చి ఆ చిన్నారిని హృదయానికి హత్తుకుంది. "ఉదయించే సూర్యుడు తన కాంతితో చీకటిని పారద్రోలినట్టు, ఈ హాలులో అబద్ధాలు వల్లించిన వాళ్ళందర్నీ నోళ్ళు పడిపోయేట్లు నగ్నసత్యాలు చెప్పేవు నాన్న, నాకన్నా "అంటూందామె. ఆ మాతృ హృదయాన్ని అందరూ తదేకంగా చూస్తూ న్నారు.

"కోర్టు యడ్జర్న్‌డ్ ఫర్ టుడే" అంటూ జడ్జిగారు లోపలకి వెళ్ళి పోయారు.

(నేటి కథ-ఆంధ్రభూమి దినపత్రిక 1-91)

—o—

# అదీ సంగతి

ప్రవీణ, వీణ అనే పేరుతో పత్రికలకు ఉత్తరాలు వ్రాస్తుంటాడు. దాదాపు అన్ని పత్రికలలోనూ అతని ఉత్తరాలు ప్రచురింపబడుతుంటాయి. కొత్త పత్రిక ఏదైనా ప్రారంభించబడిందంటే రెండవ సంచికలో మనవాడి ఉత్తరం ఉండాల్సిందే అంత కన్ విన్‌సింగ్ ఉత్తరం వ్రాస్తాడు.

ఆ మధ్యన ఒక ప్రముఖ వారపత్రికలో "వీణ" వంద ఉత్తరాలు ప్రచురణ సందర్భంగా అతనితో ఒక ఇంటర్వ్యూ వేశారు.

"ఉత్తరాలు ఎలా రాయాలి?"

"ప్రచురించాలంటే ఉత్తరం ఎలా వుండాలి?"

"మీ మొదటి ఉత్తరం ఏ పత్రికలో ప్రచురించబడింది?"

"అప్పుడు మీ హృదయం ఎలా స్పందించింది?"

"వర్ధమాన ఉత్తరాల రచయితలకు మీ సందేశం ఏమిటి?

ఇత్యాది ప్రశ్నలతో కొనసాగిందా ఇంటర్వ్యూ.

ఇంతా చేస్తే ప్రవీణ బ్రహ్మచారి!